క్లుప్తంగా

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

కనగల్: మండలంలోని లింగోటం గ్రామానికి చెందిన ఆవురేషి యాదగిరి, పోచమల్ల అశోక్, కోరే రాజశేఖర్ శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామం నుంచి నల్లగొండకు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు కనగల్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

చండూరు: మండలంలోని బంగారుగడ్డ గ్రామంలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 198 బూత్‌కు నిమ్మల భిక్షం, 200వ బూత్‌కు నలపరాజు సత్తయ్యను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం, మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యులు పాల్వాయి సత్యనారాయణరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మాదగోని నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



మొర్సుగూడెంలో బొడ్రాయికి పూజలు చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: మండలంలోని మొర్సుగూడెం గ్రామంలో శనివారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఆలయాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, నాయకులు ఆవుల యాదయ్య, రుద్రారపు శ్రీను, ఏర్పుల పరమేష్, దేవనప పెద్దులు, లింగయ్య పాల్గొన్నారు.

సర్వేయర్లతో ఆర్డీఓ సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

నల్లగొండ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో తన చాంబర్‌లో శనివారం ఆర్డీఓ రవి నల్లగొండ డివిజన్ పరిధిలోని సర్వేయర్లతో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధరణి ఫిర్యాదులతో పాటు భూసేకరణ తదితర వాటికి సంబంధించిన సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సర్వేయర్లను ఆదేశించారు.

సన్మానం



ఉపాధ్యాయుడు యాదగిరి దంపతులను సన్మానిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన వీరపాటి యాదగిరికి శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు ఎడ్ల సంధ్య పాల్గొని యాదగిరి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలి

నల్లగొండ టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతికాముకులు పోరాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన సంఘం జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ దేశాల మధ్య సోదరభావం నెలకొల్పి ప్రపంచశాంతికి పాలకులు కృషి చేయాలని అన్నారు. దేశంలో మతసామరస్యాన్ని నెలకొల్పి రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. ప్రపంచంలో ఘర్షణలకు తావు లేకుండా యుద్ధరహిత సమాజం కోసం శాంతికాముకులు, మేధావులు, అభ్యుదయ వాదులు కృషిచేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వారినే ప్రజలు ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట వెంకటరెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, ఉపాధ్యక్షుడు కోమటిరెడ్డి ప్రద్యుమ్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలకు చెరువు ఒండ్రు మట్టి తరలింపు!





పులిపలుపుల గ్రామ సమీపంలోని ఇటుక బట్టీ వద్ద డంప్ చేసిన ఒండ్రు మట్టి

- నిబంధనలు పాటించని ఉపాధి హామీ సిబ్బంది
- చోద్యం చూస్తున్న అధికారులు

మునుగోడు: ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ పథకాలు పక్కదారి పడుతున్నాయి. అధికారులు తమ విధుల పట్ల అలసత్వం వహిస్తుండడంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం చెరువుల్లోని ఒండ్రు మట్టిని తవ్వించి సారవంతం లేని రైతుల పొలాల్లో పోయాలని పనులు మంజూరు చేస్తే..కిందిస్థాయి సిబ్బంది ఇటుక బట్టీ వ్యాపారులకు ఆ మట్టిని పోయిస్తున్నారు. మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామంలో దాదాపు 7 రోజులుగా ఇటుక బట్టీ వ్యాపారులకు ఇలా ఒండ్రు మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులకు అయితే అధిక రవాణా చార్జీలు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎవరైనా రైతు ట్రాక్టర్ తెచ్చుకుంటే ఉపాధిహామీ సిబ్బంది ఆ గ్రామంలోని కూలీలతో చెరువులోని ఒండ్రు మట్టిని ట్రాక్టర్‌లో లోడ్ చేయించాలి. ఆ మట్టిని రైతు తమ భూమిలో పోసుకుని భూమిని సారవంతం చేసుకుంటాడు. అయితే పులిపలుపుల గ్రామంలోని పలువురు ట్రాక్టర్ యజమానులు ఒండ్రు మట్టి పొలాల్లో పోసేందుకు అధిక రవాణా చార్జీలు అడుగుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఒక్క ట్రిప్పు రూ.200 వరకు తీసుకునే ట్రాక్టర్ యజమానులు ప్రస్తుతం రూ.400 నుంచి రూ. 500 వరకు అడుగుతున్నట్లు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం చెరువు పక్కనే ఉన్న ఇటుక బట్టీ వ్యాపారి ట్రాక్టర్ యజమానులు అడిగినంత నగదు ఇవ్వడమే అని రైతులు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా దాదాపు 500 ట్రిప్పుల మట్టిని ఇటుక బట్టీ వద్ద పోసినట్లు పలువురు రైతులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసినా మండల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఉపాధిహామీ పథకం ద్వారా సరఫరా చేస్తున్న ఒండ్రు మట్టి పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం



ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల్లో తవ్విన మట్టిని రైతుల పొలంలోనే పోసుకోవాలి. ఇటుక బట్టీల వద్ద పోయడం సరైందికాదు. ఇప్పటి వరకు ఈ విషయం నా దృష్టికి రాలేదు. విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఇంకా ఏ గ్రామంలో అయినా ఒండ్రు మట్టి పక్కదారి పడితే రైతులు మా దృష్టికి తీసుకురావాలి.

– పూజ, మునుగోడు ఎంపీడీఓ

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



నల్లగొండలో ర్యాలీని ప్రారంభిస్తున్న రేఖల భద్రాద్రి, ఫాదర్ జోసెఫ్ తదితరులు

రామగిరి(నల్లగొండ): ఏసుక్రీస్తు శిలువపై మరణించి మూడో రోజున తిరిగి జన్మించడం గొప్ప విశేషమని రెవరెండ్ ఫాదర్ డాక్టర్ జోసఫ్ అన్నారు. నల్లగొండ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అండ్ చర్చెస్, వైఎంసీఏ సంయుక్తంగా శనివారం నల్లగొండ పట్టణంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కాంగ్రెస్ నాయకుడు రేఖల భద్రాద్రి, ఫాదర్ జోసఫ్, టీఎస్. క్రిస్టఫర్ ముఖ్యఅతిథులుగా జెండా ఊపి ప్రారంభించారు. దేవరకొండ రోడ్డులోని మరియమాత చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ డీఈఓ కార్యాలయం మీదుగా ప్రకాశం బజార్ నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ డాక్టర్ మోజస్, రెవరెండ్ ఫాదర్ పీజే జేమ్స్, వైఎంసీఏ జిల్లా అధ్యక్షుడు టీఎస్ విలియమ్స్, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ పొలిటికల్ సెక్రెటరీ పసల శౌరయ్య, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ అనితారాణి, నల్లగొండ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అండ్ చర్చెస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో..

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 3000 మంది క్రైస్తవులతో నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి నుంచి రవీంద్రనగర్, శివాజీనగర్, రామగిరి మీదుగా తిరిగి ఎన్జీ కళాశాల శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఫెలోషిప్ చీఫ్ అడ్వైజర్ దాసరి ప్రశాంత్‌కుమార్, ప్రీతి ప్రశాంత్‌కుమార్ ఈ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు డేవిడ్ రాజు, సెక్రెటరీ సైమన్, కోశాధికారి రవికుమార్, ఉపాధ్యక్షులు ఎస్‌కే జాన్ బాబు, గిడియోన్, తిమోతి, సెక్రెటరీ రాజ్‌కుమార్, సీఎస్ఐ సెక్రెటరీ సంపూర్ణాదేవి, జాయింట్ సెక్రెటరీ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మండలంలోని వంగమర్తి గ్రామంలో శనివారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సాల్మాన్, ప్రధాన కార్యదర్శి జార్జి, కోశాధికారి శ్యాంబాబు, ప్రతినిధులు నవీన్, మురళి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో ర్యాలీ ప్రారంభిస్తున్న క్రైస్తవులు



శాలిగౌరారం : వంగమర్తిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

శాలిగౌరారం: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శనివారం శాలిగౌరారం మండలంలోని మనిమద్దె గ్రామంలో పార్వతీ మహదేవ దేవాలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం గ్రామంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు జమ్ము రమేశ్, తీపిరెడ్డి సోమిరెడ్డి, మాదు సత్యనారాయణ, జిట్టబోయిన నాగరాజు, యాకస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన కార్యకర్తలతో భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బండా శ్రీశైలం

మర్రిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, కేంద్రంలో మూడోసారి కూడా ఆ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల హక్కులను కాలరాస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండా శ్రీశైలం అన్నారు. శనివారం మర్రిగూడ మండలం శివన్నగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తుందని, కార్మికులు, కర్షకులు ఏకమై తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, జెర్రిపోతుల ధనుంజయగౌడ్, మైల సత్తయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు రావడం లేదు

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ఎంపీటీసీ సభ్యులు



మిషన్ భగీరథ అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యులు

చిట్యాల: గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు ఇంటింటికి రావడం లేదని శనివారం చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కొలను సునీత అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. ఈ సమావేశం ప్రారంభంలోనే తాగునీటి సరఫరాపై నిర్వహించిన సమీక్షలో పలువురు ఎంపీటీసీ సభ్యులు మిషన్ మిషన్ భగీరథ ఏఈలు అరుణ్‌కుమార్, రమేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళ్ల వెల్లెంల గ్రామ ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఇంటింటికి మిషన్ భగీరథ నీరు రావటం లేదని, అధికారులకు గత రెండేళ్లుగా చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో భగీరథ పైపులైన్లు అతి తక్కువ లోతులో వేయడంతో డ్రెయినేజీ నిర్మాణాలు చేసినప్పుడు పైపులైన్‌లు ధ్వంసమవుతున్నాయన్నారు. ఎలికట్టె గ్రామ ఎంపీటీ సభ్యుడు గొలనుగొండ దశరథ మాట్లాడుతూ.. ఎలికట్టె గ్రామంలో నిర్మించిన రెండు మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావడం లేదన్నారు. వెలిమినేడు-01 గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు దేశబోయిన స్వరూప మాట్లాడుతూ.. వెలిమినేడులో ఇంటింటికి తాగునీరు రావడం లేదని ప్రతి సమావేశంలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవటం లేదన్నారు. దీంతో మిషన్ భగీరథ ఏఈలు అరుణ్‌కుమార్, రమేష్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలు జరుగుతున్నాయని, అందుకే ట్యాంకులను వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నామని పేర్కొన్నారు. వెంటనే ఎంపీడీఓ జయలక్ష్మి కలుగజేసుకుని మిషన్ భగీరథ నీరు రాని గ్రామాలపై నివేదికలు ఇవ్వాలని, ఎస్‌జీఎఫ్ నిధులతో మరమ్మతులు చేపట్టి మిషన్ భగీరథ నీటిని అందిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా మరికొన్ని సమస్యలను ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో 12మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఈ సమావేశంలో ఎలాంటి తీర్మానాలను సభ్యులు చేయలేదు. సమావేశంలో ఎంపీపీ కొలను సునీత, వైస్ ఎంపీపీ మర్ల అలివేలు, డిప్యూటీ తహసీల్దార్ రాగ్యానాయక్, డీఈ మహేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాస్త్ర స్కూల్ వార్షికోత్సవం



జబర్దస్త్ టీంతో శాస్త్ర స్కూల్ చిన్నారులు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

నకిరేకల్: పట్టణంలోని శాస్త్ర స్కూల్ 4వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి స్థానిక మినీ స్టేడియం మైదానం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జబర్దస్త్ షోకు చెందిన హైపర్ ఆదితో పాటు అతని టీం దొరబాబు, కెవ్వు కార్తీక్, రైజింగ్ రాజు, శాంతిస్వరూప్ హాజరై ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శాస్త్ర స్కూల్ చైర్మన్ ఎం. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, ట్రస్మా చైర్మన్, ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, నకిరేకల్ శాస్త్ర స్కూల్ డైరెక్టర్ సరితారెడ్డి పాల్గొన్నారు.

సాయి మందిరంలో పూజలు..

శాస్త్ర స్కూల్ వార్షికోత్సవానికి వచ్చిన జబర్దస్త్ ఆది, అతడి టీం సభ్యులు శనివారం రాత్రి నకిరేకల్ పట్టణంలోని సాయి మందిరాన్ని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, ఉప్పల వెంకటరమణ, గట్టు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

కట్టంగూర్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 180, ఐకేపీ ఆధ్వర్యంలో 175, ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో 15 చొప్పున మొత్తం 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. యాసంగిలో 5లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ధాన్యం ఎగుమతికి సరిపడా ఒక కోటి ఇరవై లక్షల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సరైన వసతులు ఉంటేనే నిర్వాహకులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం, సాయంత్రం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోనే మొదటగా నల్లగొండ జిల్లాలో ఈ నెల 28న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుకోవటం జరిగిందన్నారు. ఏ–గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2203, బి–గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2183 చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం నాగేశ్వర్‌రావు, డీసీఓ కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్ విజయ్, డీటీసీ ఆర్. జ్యోతి, క్లస్టర్ అధికారి సురేష్, ఏఓ శివరాంకుమార్, ఏఈఓ రమణ, సీఈఓ మల్లారెడ్డి, సిబ్బంది సీహెచ్. చంద్రయ్య, ఎన్. రాంబాబు, సీహెచ్. యాదగిరి ఉన్నారు.



అయిటిపాములలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ వెంకటేశ్వర్లు



ఇనుపాములలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేతేపల్లి మండల తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం 17 కంటే తక్కువ ఉంటేనే మద్దతు ధర అందుతుందన్నారు. రైతులు తేమలేని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఏసీఎస్ సీఈఓ వి. నర్సయ్య, ఏఈఓ వీరేష్, సిబ్బంది తండు వెంకన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



పరీక్ష ముగిసిన అనంతరం ఆనందంగా ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

కట్టంగూర్: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. కట్టంగూర్ మండల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో చివరిరోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 425 మంది విద్యార్థులకు గాను 424 మంది హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సెల్ఫీలు దిగుతూ ఒకరికొకరు వీడ్కోలు పలికారు. హాస్టల్ విద్యార్థులు ఆనందంతో సొంతూళ్లకు పయనమయ్యారు. పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ పరీక్షల రాష్ట్ర అబ్జర్వర్ కృష్ణారావు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరిశీలించారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ..

నార్కట్‌పల్లి: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దైద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి: విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

ముగిసిన ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సన్మానించిన ఉత్సవ నిర్వాహకులు

శాలిగౌరారం: మండలంలోని మనిమద్దె గ్రామంలో కాకతీయుల కాలం నాటి పార్వతీ మహదేవ దేవాలయం పునఃప్రతిష్ఠాపనోత్సవాలు శనివారంతో ముగిశాయి. దాతల సహకారంతో రూ.25లక్షలతో అభివృద్ధి చేసిన ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగిన పునఃప్రతిష్ఠాపనోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల సందర్భంగా దేవాలయం వద్ద 2వేల మందికి అన్నదానం చేశారు. స్థానిక పురోహితుడు కొడవగంటి సుబ్రమణ్యశర్మ బృందం ఆధ్వర్యంలో దేవాలయ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆయా కార్యక్రమాలలో ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే..

ఈ ఉత్సవాల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కట్టంగూర్‌లో పోలీసుల కవాతు

కట్టంగూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం శనివారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్ గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ శ్రీను, స్థానిక పోలీస్ సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.



కట్టంగూర్‌లో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు

కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతోనే పంటలు ఎండిపోయాయి

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే రాష్ట్రంలో చాల చోట్ల పంటలు ఎండిపోయాయని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో, అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో పంటలు ఎండిపోతున్నప్పటికీ జిల్లాకు చెందిన మంత్రులు కనీసం సమావేశాలు నిర్వహించడంలేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో కూడా మళ్లీ అబద్ధపు హామీలతో వస్తుందని, దీనిని ప్రజలు గమనించి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ప్రతి పోలింగ్ బూత్‌కు 370 ఓట్లు పడేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. జిల్లాలో, దేశంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, చింతల రామచంద్రం మాట్లాడుతూ.. బీజేపీని నిలువరించే శక్తి ఏ పార్టీకీ లేదన్నారు. జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తమతో 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఎవరు టచ్‌లో ఉన్నారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అహంకారానికి వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారే తప్ప, కాంగ్రెస్‌పై ప్రేమతో ఓటు వేయలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ జిల్లా కేంద్రానికి రానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బండారు ప్రసాద్, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బొబ్బ భాగ్యరెడ్డి, పోతెపాక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి